# ప్రేమ చిట్కా

నిలువుటద్దం ముందు నిలుచుని తిలకం దిద్దుకుంది పల్లవి. హమ్మయ్య! అయిపోయింది. రాణిపింక్ పంజాబీ డ్రెస్‌లో తను యువరాణిలా మెరిసిపోతోంది. పెదాలకు లిప్‌స్టిక్, నున్నని చెక్కిళ్లకు మంచి సువాసనగల క్రీమ్ పూసుకుని పౌడరు అద్దుకుంది. తనకి తనే ముద్దొచ్చే ముస్తాబు. వదులుగా అల్లుకున్న జడలో గులాబీ తురుముకుంటూ అనుకుంది. ఇంకేం వుంది. ప్రవీణ్ వచ్చేస్తాడు. 'పల్లవి... పల్లవి' అంటూ బెల్లుమోతలో ప్రణయాలు చిందే పిలుపు. చెంగున పరుగెత్తి తలుపు తెరిచిందో లేదో 'డియర్' అంటూ అమాంతం కౌగిట్లో బంధించేసి ముద్దులతో ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాడు. 'నా ప్రియపల్లవి, నా ప్రేమపల్లవి' అంటూ పాటలు మొదలు పెట్టాడు.

ఆ సరాగాల స్వరం కాస్తా గంభీరంగా మారడంతో ఉలిక్కిపడి చూసింది.

"ఇదేమిటమ్మాయ్! పగటి నిద్ర పనిచేటు, రాత్రి పెత్తనాలు నిద్రచేటు అని నీలాంటి వాళ్ళను చూసే అనుంటారు. లేచి తలుపు తియ్యి. ఆ శ్రీనివాసు, గోవిందు వచ్చుంటారు. చెప్పానుకదా! వాళ్లిద్దర్నీ టీకి పిలిచానని. ఈసరికే నువ్వు టిఫిన్ రెడీ చేసేస్తావనుకున్నాను."

"చిటికెలో చేసేస్తా మామయ్యా" తలుపు తీసి మామగారి స్నేహితుల్ని సాదరంగా ఆహ్వానించింది. యాంత్రికంగా పనిలో పడిందేగానీ కళ్లల్లో కలే మెదులుతోంది. పగటి కలైనా ఆ క్షణాలు తనెంత హాయిని అనుభవించింది! ఇంకెన్నాళ్ళు తను కలల్లోనే ప్రవీణ్‌ను చూసుకోవాలి? నిట్టూర్చింది.

★ ★ ★

ఆ రోజుకి ఉద్యోగ బాధ్యతలు పూర్తి చేసుకుని బయటపడ్డారంతా. ఆ సాయంత్రాన్ని తమ తమ ఫామిలీ మెంబర్స్‌తో ఎంత స్వీట్‌గా గడపాలి అన్నదే అందరి ఆలోచన. అప్పటికే రెడీగా వున్న కంపెనీ బస్‌లో అంతా బిలబిలమంటూ ఎక్కేసారు. బస్సు ఒక్కో స్టాపులో ఆగుతోంది. ఒక్కొక్కరు దూకినట్టే దిగేస్తున్నారు. ఉత్సాహంగా.

"అంత వేగం పనికిరాదబ్బాయిలూ. నిదానమే ప్రధానం" మందలింపుగా అన్నాడు డ్రైవర్.

"అలా అంటావేంటి భాయ్! కుర్రకారు ఖుషీ అలాంటిది. వాళ్ళ వాళ్ళ ఇళ్ళ దగ్గర పెళ్లాం బిడ్డలు ఎదురు చూడరా ఏంటి? వాళ్ళని వెంటేసుకుని సినిమాలు, షికార్లు. ఏం చెప్తాం!" కండక్టర్ సమర్థింపు.

మిగిలిన ప్రయాణికులంతా కండక్టర్ మాటకు ముసిముసిగా నవ్వుకున్నారు.

'తనదే చిత్రమైన వంటరితనం' ప్రవీణ్ రుమాలుతో ముఖం తుడుచుకుంటూ అనుకున్నాడు.

ఉసూరుమంటూ గది తాళం తీసుకుని టీ కలుపుకున్నాడు. చిరునవ్వులు చిందిస్తూ శ్రీమతి తన చెంతలేదు. ఎలా వుంటుంది? మురిపాలు, ముచ్చట్లు తీర్చుకోవాల్సిన ఈ వయసులో అత్తమామల సేవకే అంకితమైపోయింది. ఇదంతా నాన్న నిర్వాకం కదూ! తనకి సూరత్‌లో ఒక పెద్ద ప్రైవేట్ కంపెనీలో మంచి ఉద్యోగం రాగానే నాన్న ఏమన్నాడు!

"నువ్వంత దూరం వెళ్తున్నావంటే నాకూ బాధగానే వుందిరా! వెంటనే పెళ్లి చేసేస్తాను" తనకోసం అమ్మాయిల వేటలో పడ్డాడు.

అబ్బాయి అందగాడు, మంచి జీతగాడు అయితే సంబంధాలకి కొరతేముంది! ఓ రెండువారాల్లో తను గృహస్థుడైపోయాడు. పల్లవి మెడలో మూడుముళ్ళు వేస్తుంటే పల్లవించింది తన మనసు.

"నువ్వు సూరత్‌లో జాయిన్ అవడానికి ఇంకా పది రోజులు వుందిగా! ఆలోగా చెన్నపట్నం హనీమూన్ వెళ్లి వచ్చేయండి. తిరుపతిలో దేవుడి దర్శనం చేసుకోవచ్చు" టికెట్లు చేతికిస్తూ చెప్పాడు.

నాన్న ఆంతర్యం తెలియని తను 'తమ దాంపత్యం అంటే నాన్నకెంత ముచ్చట' అనుకుని తెగ సంబరపడిపోయాడు. కానీ అంతా తారుమారయింది.

"ఒరేయ్ అబ్బాయ్! ఎల్లుండే నీ ప్రయాణం! నీ సామానులన్నీ సర్దించేసాను. రిజర్వేషన్ అయిపోయింది. ఏమిట్రా... అలా పిచ్చి చూపు చూస్తావ్? రాగానే నీకు టైం వుండదని నేనూ మీ అమ్మా ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ చేసేశాం!"

"అది కాదు నాన్నా! మరి నాకక్కడ క్వార్టర్స్ ఇస్తారుగా! పల్లవి నాతో వచ్చేస్తే..." తండ్రి మాటలు పూర్తి కాకుండానే తడబడుతూ అన్నాడు.

"ఎప్పుడేం చేయాలో నాకు తెలుసురా! మీ అమ్మ మంచానపడింది. అక్క పాపం ఎన్నాళ్ళని వుంటుంది మా ఇద్దరికీ సేవ చేస్తూ?"

ప్రవీణ్ గుండె ఝల్లుమంది. 'అమ్మో! ఎంత పెద్ద ప్లాను వేసాడు నాన్న. తనకి ఇంత తొందరగా పెళ్లి చేయడంలో ఇంత ట్రిక్కు వుందన్నమాట! నాన్నా!... నిజంగా నువ్వు మేధావివి!"

"ఏరా... ఉలకవూ, పలకవు. ఏడాదో రెండేళ్ళో కళ్ళు మూసుకున్నావంటే నా స్నేహితుడి ద్వారా నీకిక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయించేస్తాను. అందాకా అత్తామామల్ని కనిపెట్టుకుని వుంటుంది."

తన అభిప్రాయంతో పని లేనట్లు చెప్పుకుపోతున్న తండ్రిని చూస్తుంటే అరికాలు మంటపైకెక్కింది. అయితే అతనిది చిన్నప్పటినుండి తండ్రికి ఎదురు చెప్పే స్వభావం కాదు. ఫలితం అప్పటి తన స్థితి! వెనుకపాటుగా వచ్చి పవన్ కళ్ళు మూసేసరికి అదిరి పడ్డాడు.

"ఏరా ప్రవీణ్! వీధి తలుపైనా వేసుకోకుండా అంత పరధ్యానం!"

"అబ్బే ఏం లేదురా! ఏదో ఆలోచిస్తూ కూర్చున్నానంతే!" స్నేహితుడి చేతుల్ని సుతారంగా తోసేస్తూ అన్నాడు.

"నీ ఆలోచనలన్నీ నాకు తెలుసురా! కొత్త జంట. నువ్విక్కడ, తనక్కడ. అపురూపంగా గడపవలసిన కాలం కాస్తా ఆవిరైపోతోంది."

"నా ముఖం. ఇంకేం కొత్త జంట. వేం ఒకరికొకరం మానసికంగా కూడా దూరమైపోతున్నామేమో అని బాధగా వుందిరా!"

"ఛత్ నోర్మూయ్! తను నీ మనసులో ఎంతగా నిండి ఉండకపోతే ఇంతలా దిగులు పడి వుంటావ్. అక్కడ పల్లవి నీలానే కలవరిస్తూ వుంటుంది. తక్షణం నువ్వెళ్లి భార్యా వియోగం భరించడం నా వల్లకాదని నీ నాన్నతో తెగేసి చెప్పేయ్. ఈ మూగవేదన ఎన్నాళ్లు?"

"సరిగ్గా అన్నావురా. మా ఇద్దరిదీ మూగవేదనే!"

"గొంతు విప్పే సాహసమే వుంటే ఈ పాటికి ఓ బిడ్డ తండ్రయి ఉండేవాడివి" మిత్రుని మాట పూర్తిచేసి ఫక్కున నవ్వాడు.

"అలా అని కాదురా. నేను మా ఇంటికెళ్లినప్పుడు పల్లవిని చూస్తే జాలేస్తుంది. తెల్లవారింది. మొదలు అర్ధరాత్రివరకూ ఇంటెడు చాకిరీ తనే. చెప్పానుకదా. మా నాన్న పీనాసితనం. బట్టలైనా చాకలికి వేయడు. మా అమ్మ నోటి ధాటికి గిన్నెలు తోమే పనిమనుషులైనా కనీసం రెండు వారాలుండరు. అన్ని అవతారాలు తనే. నేనున్న నాలుగు రోజులైనా సాయంత్రం ఎటైనా ఇద్దరం కలసి వెళ్లాలనుకుంటానా... అబ్బే... అప్పుడే మా నాన్నకి పనులూరిపోతాయ్!. 'అమ్మాయ్ ఇప్పుడు బయటకి రాదురా' నిష్కర్షగా చెప్పేస్తాడు."

ఆ మిత్రులిద్దరి సంభాషణ చాలాసేపే సాగింది. తమ బిడ్డలు పైపైకి ఎదుగుతూ ఉంటే మరింతగా ఎదగాలనీ, సౌఖ్యాలు అనుభవిస్తూ వుంటే మరింతగా సుఖమయ జీవనాన్ని

పొందాలని కోరుకునే తల్లిదండ్రులే ఉంటారని తనింతవరకూ అనుకున్నాడు. ప్రవీణ్ తండ్రి గోపాలం వింత ఆలోచన ఆశ్చర్యమే కాదు, అసహ్యం కూడా కలిగిస్తోంది. కన్నవాళ్ళే తమ సంతానం కోసం త్యాగాలు చేస్తారనీ, వాళ్ళ అభ్యున్నతి కోసమే అహర్నిశలూ పాటుపడతారని, తల్లిదండ్రుల పట్ల పిల్లలు గౌరవం చూపినా చూపకపోయినా కన్నపిల్లలపట్ల వాళ్ళకున్న ప్రేమాభిమానాలు చెక్కుచెదరవని పెద్ద పెద్ద మాటలు చెబుతారు. మరి వీడి నాన్న ఏం చేస్తున్నాడు? పాపం వీడి అమాయకత్వంతో కోడల్ని పనిమనిషిగా, వంట మనిషిగా చివరికి ఒక సేవకురాలిగా ఉపయోగించుకుని తన పబ్బం గడుపుకుంటున్నాడు. వీడెంత వెర్రివెధవ కాకపోతే శోభనంనాడే వాళ్ళక్కయ్య వీడి చెవిలో ఏదో ఊదిందట. సరేనని తలవూపి అలానే నడుచుకుంటాడట. వాళ్ళు ఎత్తులు వేస్తే పై ఎత్తులు వెయ్యాలే తప్ప ఇలా అణిగి వుంటే మరింత అణిచివేస్తారు' అనుకున్న పవన్, ప్రవీణ్‌కి హితోపదేశం చేసాడు.

★ ★ ★

"ఇదేంటి రుక్మిణీ! ఈరోజు కాఫీ నువ్వు తీసుకొచ్చావ్?" భార్య చేతుల్లోంచి కాఫీ కప్పు అందుకున్నాడు గోపాలం.

భార్య చెప్పిన మాట వినేసరికి అతని కళ్ళు చింతనిప్పులే అయ్యాయి. మనసు కుతకుతలాడిపోయింది.

"ఏది అమ్మాయ్ ఎక్కడ?"

"ఎందుకు ఆవేశం? ఇహ మనం చేసేదేముంది? రాత్రే నాతో చెప్పింది. నాలుగో నెలట!"

"మరి నువ్వేమీ అనలేదా?"

"ఏం అనగలను? మీకు మనవడు పుట్టబోతున్నాడు అత్తయ్యా అంటూ గారాలొలుకుతూ చెప్తుంటే!"

"అదే రుక్మిణీ! నీ ఆరోగ్యం చక్కబడేవరకూ పిల్లాపీచూలాంటి బెడదవద్దని మొదటి రాత్రే తమ్ముడికి, మరదలికి అమ్మాయి గట్టిగా చెప్పిందిగా."

"ఆ విషయం వదిలేస్తారా? మనం ఎలా అతి తెలివిగా కోడల్ని తెచ్చుకుని మన సుఖం చూసుకున్నామో ఇచ్చిన మాట, పెట్టిన ఒట్టు గట్టున పడేసి వాడి పెళ్లాన్ని ఈ బందిఖానా నుంచి అంతకన్నా తెలివిగా విడిపించేసాడు." అయిదో నెలలోనే సూడిదలు తీసుకొచ్చి పార్వతి కూతుర్ని తీసుకువెళ్లిపోయింది. పల్లవి సీమంతానికి వచ్చిన ప్రసన్న తమ్ముడ్ని నిలదీయకుండా ఉండలేకపోయింది. ప్రవీణ్ దోషిలా తలదించుకోలేదు.

"తల్లిదండ్రుల్ని ప్రేమించాలి. వాళ్ళ బాధ్యత తీసుకోవాలి. నేనూ ఒప్పుకుంటాను. ఆ గౌరవాన్ని అలుసుగా తీసుకుని నాన్న మా పట్ల చూపిన స్వార్థం నీకు సబబుగా తోస్తుందా?"

తమ్ముడు సూటిగా వేసిన ప్రశ్నకి ప్రసన్న నిరుత్తరురాలైంది.

☆ ☆ ☆

ముద్దులొలికే మూడు నెలల పాపతో మొదటిసారిగా భర్త ఇంట్లో అడుగుపెట్టింది పల్లవి. ప్రవీణ్ మనసు ఆనందంతో పరవళ్ళు తొక్కింది. ఇన్నాళ్ళూ తనేదో పోగొట్టుకున్నాడు. ఎంతో కోల్పోయాడు అన్పించింది. పట్టరాని సంతోషంతో తన ఫ్రెండ్స్ అందరికీ పార్టీ ఏర్పాటు చేసాడు.

"ఇదిగో అన్నయ్యా! నీ ముద్దుల మేనగోడలు. నీ ప్రేమ చిట్కా ఫలించి మా ఇద్దర్నీ కలిపిన బంగారు కొండ" పల్లవి మాటల్లో పవన్ తెలివితేటలపట్ల గౌరవం తొణికిసలాడింది.

"ఇంతకీ ఈ ప్రేమ చిట్కాకి పేరేం పెట్టారు?" పాపని సుతారంగా అందుకుంటూ అడిగాడు.

"దీనికి వేరే పేరెందుకు? పుట్టకముందే పెట్టేసుకుందిగా ఈ చిన్నారి ప్రేమ!"

పవన్ మనసు విచిత్రమైన అనుభూతితో నిండిపోయింది. తనవల్ల మిత్రునికి అంతా మంచే జరిగింది. తన బుద్ధిబలంతో ప్రవీణ్ తల్లిదండ్రులకి గుణపాఠం చెప్పగలిగాడు. కన్న కొడుక్కి భార్యని దూరం చేసి, కోడల్ని స్వప్రయోజనానికి వాడుకోవడం వాళ్ళది అత్యాశే అని తెలియవచ్చింది. తేలు కుట్టిన దొంగల్లా కిమ్మనకుండా వుండిపోయారు. ముసిముసిగా నవ్వుకుంటూ తను బహుమతిగా తెచ్చిన ఉంగరాన్ని ప్రేమ వేలుకి తొడిగాడు పవన్.

మార్చి 2002 ఆంధ్రభూమి మాసపత్రిక ❑